తిరుచెందూరు ఆలయంలో

స్కందషష్ఠి ప్రారంభం



ఇష్టదేవేరులతో జయంతినాథస్వామి



యాగశాల పూజల్లో ఆలయ అర్చకులు, శైవాగమ పండితులు



ఉత్సవాలు ప్రారంభించడానికి ముందు ఆలయ ట్రస్టీ అరుళ్‌మురుగన్‌కు తాంబూలం సమర్పిస్తున్న అర్చకులు



వడపళని ఆలయంలో ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరుచెందూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్కందషష్ఠి ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను వీక్షించడానికి ఇప్పటికే సుమారు లక్ష మంది భక్తులు ఆలయం చుట్టూరా ఉన్న దేవస్థానం అతిథిగృహాలు, వివిధమఠాల వసతి గృహాలు, ప్రైవేటు లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లలో బస చేస్తున్నారు. ఆలయ ప్రాంగణం వేకువజాము నుంచే భక్తులతో కిటకిటలాడింది. స్కందషష్ఠి వేడుకల సందర్భంగా ఆలయాన్ని వేకువ జాము ఒంటిగంటకే తెరిచారు. తెల్లవారు జామున 1.30 గంటలకు విశ్వరూపదర్శనం, 2 గంటలకు ఉదయమార్తాండ అభిషేకం నిర్వహించారు. ఉదయం 6 గంటలకు జయంతి నాథర్ యాగశాలలో స్వామి కొలువుదీరారు. ఉదయం 7 గంటలకు యాగశాల పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు మూలవిరాట్టుకు ఉచ్చికాల అభిషేకం, దీపారాధన నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు యాగ పూజ, దీపారాధన జరిపారు. ఆ తర్వాత వేల్ వగుప్పు, వీరవాల్ వగుప్పు పాటలను అర్చకులు శ్రావ్యంగా గానం చేస్తుండగా స్వామి జయంతినాథుడు వళ్ళి, దేవసేప సమేతుడై స్వర్ణ చప్పరంపై షణ్ముగ విలాసమండపానికి వేంచేశారు. అక్కడ స్వామి, ఆయన ఇష్టదేవేరులకు దీపారాధన నిర్వహించారు. సాయంతం 4.30 గంటలకు తిరువాడు దురై ఆధీన షష్ఠి మండపంలో జయంతినాథస్వామికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. దీపారాధన తర్వాత స్వామి వళ్లీదేవసేన సమేతుడై స్వర్ణరథంలో గిరి వీధిలో ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. ఇక ఆదివారం నుండి నాలుగు రోజులపాటు ఆలయాన్ని వేకువజాము 3గంటలకుతెరచి విశ్వరూపం, ఉదయ మార్తాండ అభిషేకం, ఉచ్చికాల అభిషేకం, పూజలు నిర్వహించనున్నారు. ఈవేడుకల్లో ప్రధాన ఘట్టమైన శూరసంహార వేడుకలు ఈనెల 7వతేది సాయంత్రం అక్కడి సముద్రతీరంలో లక్షలాదిమంది భక్తుల నడుమ జరుగనున్నాయి. ఆ తర్వాత 8న తిరు కల్యాణమహోత్సవం కనుల పండువగా నిర్వహించనున్నారు. స్కందషష్ఠి ప్రారంభోత్సవాలను వీక్షించి ఆరు రోజులపాటు వ్రతమాచరించడానికి విచ్చేసిన భక్తులంతా శనివారం ఉదయం సముద్రతీరంలో, నాళికినరులో పుణ్యస్నానమాచరించి కంకణధారణతో తమ వ్రతాన్ని ప్రారంభించారు. ఈ షష్ఠి వేడుకలను తిలకించడానికి రోజూ లక్షలమంది దాకా భక్తులు విచ్చేస్తారని ఆలయ నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. సుమారు 2 వేల మంది పోలీసులు ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తుల భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

తిరుత్తణిలో..

తమిళుల ఆరాధ్యదైవం కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో పంచమ దివ్యక్షేత్రంగా కీర్తిగడించిన తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్కందషష్ఠి వేడుకలు శనివారం ఉదయం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవమూర్తి షణ్ముఖపెరుమాన్‌కు ఈ నెల 7వ తేదీవరకు లక్షార్చన నిర్వహించనున్నారు. అదే రోజున వివిధ రకాల మూడు టన్నుల పుష్పాలంతో ఉత్సవమూర్తికి పుష్పాంజలి నిర్వహిస్తారు. ఈ నెల 8న ఉదయం 10 గంటలకు పర్వతాలయం కావడి మండంలో స్వామివారి తిరుకల్యాణోత్సవం జరగనుంది. శనివారం ఉదయం స్కందషష్ఠి వేడుకల ప్రారంభ సందర్భంగా స్వామివారికి నారికేళం, పాలు, చందనం, కదంబ పొడి, తేనె, పెరుగు తదితర సువాసన ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆ తర్వాత రజత కవచ ధారణ, పుష్పాలంకరణ చేసిన మీదట మహాదీపారాధన జరిపారు. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

వడపళనిలో...

చెన్నైలోని వడపళని మురుగన్ ఆలయంలో స్కందషష్ఠి వేడుకలు శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ నెల 12 వరకూ ప్రతిరోజూ రాత్రి మంగళగిరి విమానం, చంద్రప్రభ, మేష, నాగ వాహనం తదితర వాహనాలపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేయనున్నారు. ఈ నెల 7న మహా స్కంద షష్ఠి లక్షార్చన ప్రారంభమవుతుంది. అదే రోజు రాత్రి 8 గంటలకు శూర సంహార వేడుకలు జరుగుతాయి.

సిరువాపురిలో..

తిరువళ్లూరు జిల్లా సిరువాపురి బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలోనూ స్కంద షష్ఠి వేడుకలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధానార్చకుడు ఆనందన్ నేతృత్వంలో ధ్వజారోహణం నిర్వహించారు. ఈ నెల 7 సాయంత్రం ఆలయం వద్ద శూరసంహార మహోత్సవం జరగనుంది. స్కంద షష్ఠి వేడుకలు ప్రారంభం కావటంతో శనివారం ఉదయం వేలాదిమంది భక్తులు ఆలయంలోని స్వామివారిని దర్శించి, కంకణ ధారణ చేసుకుని షష్ఠి వ్రతాన్ని ప్రారంభించారు.

కందకోట్టమ్‌లో..

ప్యారీస్ కార్నర్ రాసప్పచెట్టి వీధిలోని కందకోట్టమ్ మురుగన్ ఆలయంలో స్కందషష్ఠి వేడుకలు శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఉదయం 5.30 గంటలకు స్వామివారి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా ఈ నెల 7న శూరసంహారం, 8న తిరుకళ్యాణం అత్యంత వైభవంగా జరుగుతుందని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. ఇదే రీతిలో కుండ్రత్తూరు సుబ్రహ్మణ్యస్వామి వారి ఆలయంలోనూ స్కందషష్ఠి వేడుకలు ప్రారంభమయ్యాయి.

కొత్త పొత్తులకు నాంది?

డిసెంబరు 6న ఒకే వేదికపై విజయ్ - తిరుమా





చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీఎంకే వ్యవహారశైలి పట్ల గత కొంతకాలంగా అసంతృప్తితో వున్న డీపీఐ.. 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) వైపు చూస్తోందా?.. ఆ పార్టీతో చేతులు కలిపేందుకు సిద్ధమవుతోందా?.. ఇందులో భాగంగానే వచ్చే నెల 6న ఈ రెండు పార్టీల అధినేతలు ఒకే వేదిక పైకెక్కనున్నారా?.. అవుననే అంటున్నాయి రాజకీయ వర్గాలు. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే ఈ రెండు పార్టీల నేతలు వేదిక పంచుకోవడం, ఆ తరువాత ఒకే గొడుగు కిందకు చేరడం ఖాయమని ఆ వర్గాలు అంచనా వేస్తున్నాయి. డీపీఐ ఉప ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జునా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై రచించిన పుస్తకావిష్కరణ డిసెంబరు 6న చెన్నైలో జరుగనుంది. ఈ పుస్తకాన్ని డీపీఐ అధినేత తిరుమావళవన్ ఆవిష్కరించనుండగా, తొలి ప్రతిపతిని టీవీకే అధినేత విజయ్ అందుకోనున్నారు. ఈ మేరకు ఈ ఇద్దరు నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అంగీకరించారని, అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉందని రెండు పార్టీల వర్గాలు చెబుతున్నాయి. ఆదవ్ అర్జునా ఇటీవల 'పాలనలో భాగం - అధికారంలో భాగం' అనే నినాదాన్ని ముందుకు తీసుకొచ్చారు. ఆయన చేపట్టిన ఈ నినాదం డీఎంకే కూటమిలో కలకలం రేపింది. అయితే ఆ తరువాత డీపీఐ అధినేత తిరుమావళవన్ వివరణతో అది కాస్త సమసినట్లే కనిపిస్తోంది. అయితే ఆదవ్‌పై పార్టీపరమైన చర్యలుంటాయని భావించిన డీఎంకేకి కాస్త నిరాశ కలిగించింది. తిరుమావళవన్ కేవలం సర్దుబాటు మాటలతోనే సరిపెట్టడం డీఎంకేలో అనుమానం రేపుతోంది.

'భాగస్వామ్య' ప్రకటనతో పార్టీలకు ఆశ!

డీఎంకే అనుమానం కొనసాగుతుండగానే ఇటీవల విక్రవాండిలో జరిగిన టీవీకే మహానాడులో ఆ పార్టీ అధినేత విజయ్.. డీపీఐ కోరుకున్న నినాదానికి మద్దతు పలికారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీతో చేతులు కలిపే పార్టీలకు అధికారంలో భాగస్వామ్యం ఇస్తామంటూ ప్రకటించారు. ఈ ప్రకటన డీపీఐతో పాటు కాంగ్రెస్ వంటి పార్టీల్లోనూ ఆశలు రేపుతోంది. అయితే విజయ్ ప్రకటన వెనుక ఆదవ్ అర్జునా వున్నట్లు డీఎంకే వర్గాలు గట్టిగా అనుమానిస్తున్నాయి. తమిళనాడు ఇంటెలిజెన్స్ విభాగం విజయ్ - తిరుమావళవన్ - ఆదవ్‌పై దృష్టి సారించింది. ఈ ముగ్గురి కదలికల్ని ఇంటెలిజెన్స్ వర్గాలు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి చేరవేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురూ వచ్చే నెల ఒకే వేదికపై ఎక్కనున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రభుత్వానికి సమాచారం చేరవేశాయి.

ఎవరీ ఆదవ్ అర్జునా?.. ఎందుకింత కలవరం?

2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో, 2021 అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరకు డీఎంకేకు అన్ని వ్యూహాలను రచించిన 'ఓఎంజీ' అనే సంస్థలో ఆదవ్ కీలకపాత్ర పోషించారు. నిజానికి 2021 అసెంబ్లీ ఎన్నికల్లో తమ వ్యూహకర్తగా అన్నాడీఎంకే ప్రశాంత్‌కిశోర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. కొంతమేర అడ్వాన్స్ కూడా ఇచ్చింది. అయితే ఈ విషయాన్ని తెలుసుకున్న ఆదవ్.. హుటాహుటీన ఢిల్లీ వెళ్లి ప్రశాంత్ కిశోర్ మనసు మార్చారు. ప్రశాంత్‌కిశోర్‌తో పలుమార్లు చర్చించి, డీఎంకే వైపు మళ్లించారు. ఆ నిర్ణయం డీఎంకే విజయాన్ని సునాయాసం చేసిన విషయం తెలిసిందే. అనంతరం డీఎంకేతో పొత్తుల కోసం వామపక్షాలు, మరికొన్ని చిన్న పార్టీల నేతలతో మాట్లాడి ఒప్పించగలిగారు.

అధికారం తరువాత దూరం దూరం..

డీఎంకే అధికారంలోకి వచ్చాక ఆదవ్‌ను దూరంగా పెట్టిందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. దీంతో తీవ్ర అసంతృప్తితో వున్న ఆదవ్.. అనంతర కాలంలో డీపీఐ అధినేత తిరుమావళవన్‌కు దగ్గరయ్యారు. అంతేగాక డీపీఐలో చేరి ఆ పార్టీ ఉపప్రధాన కార్యదర్శి పదవిని పొందారు. నిజానికి గత పార్లమెంటు ఎన్నికల్లో ఆదవ్ కోసమే తిరుమావళవన్ కళ్లకుర్చి నియోజకవర్గం అడిగారు. కానీ ఈ విషయాన్ని గ్రహించిన డీఎంకే.. ఆ సీటును డీపీఐకి ఇవ్వలేదని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. అందుకే ఆదవ్ కూడా డీఎంకే పట్ల తీవ్ర అసంతృప్తితో వున్నారని తెలుస్తోంది. ముందస్తు వ్యూహాత్మకంగానే డీపీఐ, టీవీకేల అధినేతలను ఒకే వేదికపై తీసుకువస్తున్నట్లు తెలిసింది. ఇందుకు పుస్తకావిష్కరణ ఒక వేదిక కానుంది. అయితే ఈ కార్యక్రమంపై విజయ్, తిరుమావళవన్ స్పష్టత ఇవ్వాల్సివుంది. ఒకవేళ ఈ ఇద్దరు నేతలు ఒకే వేదికపై చేరితే మాత్రం అది కచ్చితంగా కొత్త పొత్తులకు దారితీస్తుందని, రాష్ట్ర రాజకీయవర్గాల్లో కొత్త కూటమికి ఊపిరి పోసినట్లవుతుందని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

విజయ్‌పై విమర్శలు వద్దు

అన్నాడీఎంకే శ్రేణులకు ఈపీఎస్ మౌఖిక ఆదేశాలు!



చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం అధినేత, సినీ నటుడు విజయ్‌పై ఎవరూ ఎలాంటి విమర్శలు చేయకూడదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పార్టీ శ్రేణులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకేతో పొత్తు పెట్టుకునే అవకాశం ఉందని, ఆ పొత్తుకు తమ పార్టీయే నాయకత్వం వహించనుందని. ఈ కారణాలను దృష్టిలో ఉంచుకుని విజయ్‌పై జిల్లా కార్యదర్శులుగానీ, పార్టీకి చెందిన యూనియన్, గ్రామశాఖ నాయకులు కూడా ఎలాంటి విమర్శలు చేయకుండా సంయమనం పాటించాలని సూచించినట్లు సమాచారం. ఇటీవల విక్రవాండిలో జరిపిన మహానాడులో డీఎంకే, బీజేపీలపై తీవ్ర విమర్శలు చేసిన విజయ్ అన్నాడీఎంకేపై పల్లెత్తు మాట అనకుండా జాగ్రత్త వహించారని, అంతేకాకుండా అధికారంలో భాగస్వామ్యం దిశగా భావసారూప్యత కలిగిన పార్టీలతో తమ పార్టీతో పొత్తు కుదుర్చుకోవచ్చని కూడా ప్రకటించారు. విజయ్ చేసిన ఈ ప్రకటన అన్నాడీఎంకే పట్ల ఆయన పెట్టుకున్న సానుకూలతకు గట్టి నిదర్శనమని ఈపీఎస్ భావిస్తున్నారు. ఈ నెల 6న జరుగనున్న జిల్లా కార్యదర్శుల సమావేశంలో టీవీకే సానుకూల వైఖరిపైనే ప్రధానంగా చర్చించనున్నట్లు అన్నాడీఎంకే వర్గాలు చెబుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో తెగదెంపులు చేసుకోవడంతో ఇకపై ఆ పార్టీ వైపు కన్నెత్తి చూసే ప్రసక్తేలేదని, ఈ పరిస్థితుల్లో విజయ్ నాయకత్వంలోని టీవీకేతో పొత్తుపెట్టుకుంటే రాష్ట్రంలో ఏర్పడబోయే అన్ని కూటముల కంటే తమ కూటమి మెగా కూటమిగా మారుతుందని ఈపీఎస్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కార్యదర్శుల సమావేశంలో విజయ్‌ని ఎవరూ విమర్శించకూడదంటూ ఈపీఎస్ ఉత్తర్వు జారీ చేయటం ఖాయమని కూడా ఆయన అనుచరులు చెబుతున్నారు. విక్రవాండి మహానాడులో అన్నాడీఎంకేపై ఎలాంటి విమర్శలు చేయకపోవడం వల్ల విజయ్ తమ పార్టీలతో తప్పకుండా పొత్తుపెట్టుకుంటారని పార్టీసీనియర్‌నేతలు, మాజీ మంత్రులు కూడా పేర్కొంటున్నారు. ఇక ఈ నెల 6న జరిగే జిల్లా కార్యదర్శుల సమావేశంలో ప్రధానంగా పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణపై ఈపీఎస్ సమగ్రంగా చర్చలు జరుపనున్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీని పటిష్ఠ పరిచేందుకు సుమారు లక్షమందిని నియమించనున్నారు. వీరంతా గ్రామాలలో క్షేత్ర పర్యటన జరిగిప పార్టీకున్న పలుకుబడి, పార్టీ నాయకులకు ప్రజలకు మధ్య గల సన్నిహిత సంబంధాలు గురించి పార్టీ అధిష్ఠానవర్గానికి తెలియజేస్తారు. త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహరచనలు గురించి కూడా ఈపీఎస్ జిల్లా నేతలతో చర్చలు జరుపనున్నారు.





శిక్షణ తరగతులకు హాజరైన తెలుగేతరులు - చిన్నారులతో నిర్వాహకులు

ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో

తెలుగు శిక్షణ తరగతులు ప్రారంభం

ప్యారీస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక టినగర్‌లోని ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యూటీఎఫ్) కార్యాలయంలో శనివారం తెలుగు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 3 గంటలకు సమాఖ్య సెక్రటరీ జనరల్ శ్రీలక్ష్మి మోహన్‌రావు స్వాగతోపన్యాసం చేస్తూ... డబ్ల్యూటీఎఫ్ అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరా దత్ అందజేస్తున్న సహకారంతో ఇతర భాషల వారికి తెలుగు మాట్లాడ్డం, రాయడంపై ప్రతి శనివారం శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. గతంలో నిర్వహించిన తరగతులకు 65 మంది హాజరు కాగా, ఈసారి చిన్నపిల్లల నుంచి సీనియర్ సిటిజన్ల వరకు సుమారు 130 మందికి పైగా పాల్గొన్నారని, వీరికి టీచర్లు మోహన్, మాణిక్యం బోధిస్తారని తెలిపారు. జనవరి 3, 4 తేదీల్లో హైదరాబాదులో డబ్ల్యూటీఎఫ్ తరఫున నిర్వహించనున్న తెలుగు మహాసభలను విజయవంతం చేసేందుకు పలు ప్రాంతాల్లో ఉన్న తెలుగు వారు తమ వంతు సహకారం అందజేయాలని ఆమె కోరారు. అనంతరం సమాఖ్య ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ ఎంవీ నారాయణ గుప్తా మాట్లాడుతూ... దేశ భాషల్లో కెల్లా తెలుగు భాషా సంస్కృతికి మాధుర్యం గొప్పదని గ్రహించిన తెలుగేతరులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న డబ్ల్యూటీఎఫ్ కృషి అభినందనీయమన్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసి ఆంధ్రరాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు అమరజీవి పొట్టిశ్రీరాములు అని, ఆయన జీవిత చరిత్రను భావితరాలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ శివకుమారి, సురేఖ మోహన్‌దాస్, టి.రుక్మిణి దేవి, గోటేటి వెంకటేశ్వర రావు పాల్గొనగా, గుమ్మడి విజయశ్రీ, మాదాల వెంకట సుబ్బారావు స్పాన్సర్ చేశారు.

డిసెంబరులో అసెంబ్లీ సమావేశాలు



శనివారం ముఖ్యమంత్రి స్టాలిన్‌తో భేటీ అయిన స్పీకర్ అప్పావు

ప్యారీస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు డిసెంబరులో జరిగే అవకాశమున్నట్లు తెలిసింది. 2024వ సంవత్సర తొలి రాష్ట్ర అసెంబ్లీ సమావేశం ఫిబ్రవరి 12వ తేది ప్రారంభమైంది. ఈ సంవత్సరం మొట్టమొదటి సమావేశం కావడంతో రాష్ట్ర గవర్నర్ ఆర్ ఎన్ రవి ప్రసంగించగా, గవర్నర్ ప్రసంగానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆమోదించిన తీర్మానాలపై మూడు రోజులు సాగిన చర్చల్లో ఆయా శాఖల మంత్రులు శాసనసభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. అనంతరం 2024-25వ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ 19న, వ్యవసాయ బడ్జెట్ 20వ తేది అసెంబ్లీలో దాఖలు చేయగా, వాటిపై జరిగిన చర్చలో అఖిలపక్షాల శాసనసభ్యులు పాల్గొన్నారు. మంత్రుల సమాధానం అనంతరం పలు న్యాయ శాఖ బిల్లులు ఆమోదించి 22వ తేదీన సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ నేపథ్యంలో, లోక్‌సభ ఎన్నికలు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఏడు విడతలుగా నిర్వహించనున్నట్లు మార్చి 16వ తేది కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. పార్లమెంటు ఎన్నికలు రావడంతో రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థిక పద్దులపై జరగాల్సిన ప్రత్యేక సమావేశం వాయిదా పడింది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో, ఆర్థిక పద్దులపై చర్చలు నిర్వహించేందుకు అనుకూలంగా జూన్ 25వ తేది మళ్లీ ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు 9 రోజులు కొనసాగాయి.

ముందస్తు చర్యలు...

రాజ్యాంగ శాసనం ప్రకారం సహజంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలి. అందువల్ల డిసెంబరులో మళ్లీ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని, స్పీకర్ అప్పావు త్వరలోనే తేది ప్రకటిస్తారని, ఈ సమావేశాలు నాలుగు, ఐదు రోజులు కొనసాగుతాయని సచివాలయ వర్గాలు తెలిపాయి.

రాయపురంలో తాత్కాలిక బస్టాండ్

- టెండర్లు ఆహ్వానించిన జీసీసీ

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపురంలో రూ.3.42 కోట్లతో తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ టెండర్లు ఆహ్వానించింది. చెన్నైలో అతిప్రాచీన బస్టాండ్‌గా పేరుగాంచింది బ్రాడ్ వే. ఈ బస్టాండ్‌ను ఆధునికీకరించాలని జీసీసీ నిర్ణయించింది. వాణిజ్య సముదాయాలు, వాహన పార్కింగ్ వంటి పలు అధునాతన వసతులతో భారీ బస్టాండ్‌ను రూ.823 కోట్లతో ఏర్పాటు చేయాలని ప్రణాళిక సిద్ధం చేసింది. బ్రాడ్ వే బస్టాండ్ ఆధునీకీకరణ సందర్భంగా ఈ బస్టాండ్‌ను తాత్కాలికంగా ఐల్యాండ్ గ్రౌండ్స్‌కు తరలించాలని నిర్ణయించారు. కానీ, వివిధ కారణాలతో ఆ నిర్ణయాన్ని మార్చుకున్నారు. స్థానిక రాయపురం సమీపంలోని ఎన్నార్డీ ఫ్లై ఓవర్ సమీపంలోని చెన్నై హార్బర్‌కు సొంతమైన స్థలంలో బ్రాడ్ వే తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. బస్సులు నిలిపేందుకు ప్లాట్‌ఫారాలు, తాగునీరు, టాయిలెట్ సౌకర్యం, కార్యాలయం తదితరాల ఏర్పాటుకు రూ.3.42 కోట్లతో టెండర్లు ఆహ్వానించింది. టెండర్ ప్రక్రియ పూర్తిచేసి త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

సమాచార దర్శిని

వెబ్‌సైట్‌లో వ్యవసాయ భూముల వివరాలు

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూముల వివరాలు వెబ్‌సైట్ ద్వారా తెలుసుకొనే వెసులుబాటును రెవెన్యూ శాఖ పరిచయం చేసింది. రాష్ట్రంలో భూములకు సంబంధించిన అన్ని దస్తావేజులు 'డిజిటల్ మోడ్‌'లోకి మార్చే పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. తొలి దశలో కొత్తగా జారీ చేసిన భూముల పట్టాలు డిజిటలైజ్ చేశారు. తదుపరి దశలో భూములకు సంబంధించిన 'ఎ' రిజిస్టర్, భూ సర్వే మ్యాప్‌ల వంటి పత్రాలు డిజిటలైజ్ చేయనున్నారు. 2020లో ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్‌లో ప్రత్యేక మొబైల్ ఫోన్ యాప్ రూపొందించే చర్యలు చివరి దశలో ఉన్నాయి. రైతులు తమ భూమి వివరాలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసుకొనే సౌకర్యం కల్పించారు. రెవెన్యూ శాఖ www.clip.tn.gov.in/లో ఈ వివరాలు తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

7న వేదగిరీశ్వర ఆలయంలో ఏకదిన లక్షార్చన

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లాలో ప్రసిద్ధిచెందిన తిరుక్కళుకుండ్రం వేదగిరీశ్వర ఆలయంలో ఈ నెల 7వ తేది నిర్వహించనున్న కందషష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఏకదిన లక్షార్చనలో రూ.150 చెల్లించి భక్తులు పాల్గొనవచ్చని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆ రోజున ఉదయం 8 నుంచి రాత్రి 8.30 గంటలకు వరకు లక్షార్చన జరగనుంది. ఉత్సవాల్లో భాగంగా 8న సాయంత్రం ఉత్సవమూర్తికి అభిషేకాలు, 9న ఉదయం క్షీరాభిషేకం నిర్వహించనున్నారు.

రెండు రోజుల్లో రూ.200 కోట్ల చికెన్ హాంఫట్!

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా రెండు రోజుల్లో రూ.200 కోట్ల మేర కోడి మాంసం విక్రయాలు జరిగాయి. ఈ విషయమై రాష్ట్ర గుడ్ల కోళ్ల ఫారం యజమానుల సమాఖ్య ఉపాధ్యక్షుడు వాంగిలి సుబ్రమణ్యం మాట్లాడుతూ... దీపావళి పండుగ సందర్భంగా కోడి మాంసం ధరలు సహజంగానే పెరిగాయన్నారు. సాధారణంగా వారంలో 2.50 కోట్ల కిలోల కోడి మాంసం విక్రయాలు జరుగుతాయన్నారు. కానీ, దీపావళి రోజున, తదుపరి రోజు రెండు రోజుల్లో మాత్రమే రూ.2 కోట్ల కోడిమాంసం విక్రయాలు జరిగాయని, గత ఏడాదితో పోల్చితే 25 శాతం పెరిగిందన్నారు.

రూ.23 కోట్లతో పాడికుప్పం ఫ్లై ఓవర్

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూందమల్లి రోడ్డు - పాండికుప్పం అనుసంధానించేలా రూ.22.6 కోట్లతో కొత్త ఫ్లై ఓవర్ ఏర్పాటుకు సీఎండీఏ నిర్ణయించింది. పాడికుప్పం నుంచి పూందమల్లి వెళ్లే రహదారిలో నిరంతరం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీన్ని పరిష్కరించేలా ఈ మార్గంలో ఫ్లై ఓవర్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై స్పందించిన సీఎండీఏ, పాండికుప్పం-పూందమల్లి రోడ్డు అనుసంధానం చేసేలా 90 మీటర్ల దూరం ఫ్లై ఓవర్ నిర్మించనుంది. టెండర్ ప్రక్రియ పూర్తిచేసి 14 నెలల్లో ఫ్లై ఓవర్ నిర్మాణాలు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఐదు రోజులు నాగై-శ్రీలంక నౌకా సేవలు

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం నుంచి శ్రీలంకలోని కాంగేశన్ హార్బర్‌కు నడుపుతున్న ప్రయాణికుల నౌక సేవలు ఇక నుంచి వారంలో ఐదు రోజులు అందుబాటులో ఉంటాయని నౌకాయాన సంస్థ ప్రకటించింది ఆగస్టు 16వ తేది నుంచి ఈ రవాణా ప్రారంభించగా, ప్రయాణికుల నుంచి ఆశించిన స్పందన లేకపోవడంతో వారానికి మూడు రోజులు మాత్రమే నడుపుతున్నారు. ప్రస్తుతం ప్రయాణికుల సంఖ్య పెరగడంతో సోమ, బుధవారాలు మినహా మిగిలిన ఐదు రోజులు ఈ నౌకా సేవలు అందుబాటులో ఉంటాయని సంస్థ తెలియజేసింది.

10న డీఎండీకే జిల్లా కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే జిల్లా కార్యదర్శుల సమావేశం ఈ నెల 10వ తేది జరగనుంది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది. కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రధాన కార్యదర్శి ప్రేమలత నేతృత్వంలో సమావేశం జరగనుందని, ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శులు తప్పకుండా హాజరుకావాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పార్టీని బలోపేతం చేయడం, అసెంబ్లీ ఎన్నికలకు కార్యకర్తలను సన్నద్ధం చేయడం, ప్రచారం తదితరాలపై సమావేశంలో చర్చించనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

5 వేల మెగావాట్లు తగ్గిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దీపావళి సెలవులు, వర్షాలు కురుస్తుండడంతో రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ వినియోగం తగ్గింది. సాధారణంగా రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ వినియోగం 16 వేల మెగావాట్లు ఉండగా, శీతాకాలంలో 10 వేల మెగావాట్లు, వేసవిలో 20 వేల మెగావాట్లకు చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో, అక్టోబరులో ఈశాన్య రుతుపవనాలు ప్రారంభం కావడంతో, పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో, రోజువారీ విద్యుత్ వినియోగం 17,500 మెగావాట్లకు తగ్గింది. దీపావళి పండుగ సందర్భంగా కర్మాగారాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో గత నెల 30వ తేది 16,000 మెగావాట్లుగా ఉన్న రోజువారీ విద్యుత్ వినియోగం, దీపావళి రోజున 5,000 మెగావాట్లు తగ్గి 11,000 మెగావాట్లుగా నమోదైందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

సినీ తారలు రాజకీయాల్లో గెలుస్తామనుకోవడం తప్పు

● విజయ్‌కి బీజేపీ నేత హెచ్ రాజా చురక

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సినిమాల్లో చాలినంత సంపాదించి ఓ వెలుగు వెలిగి రాజకీయాల్లోనూ అదే తరహాలోనే గెలుస్తామని అనుకోవడం పెద్ద తప్పు అని టీవీకే అధినేత విజయ్‌ను ఉద్దేశించి బీజేపీ రాష్ట్ర సమన్వయకర్త హెచ్‌రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. తంజావూరు జిల్లా కుంభకోణం సమీపం తిరునాగేశ్వరంలోని ఒప్పిలియప్పన్ ఆలయాన్ని శనివారం ఉదయం ఆయన కుటుంబ సమేతంగా దర్శించారు. ఆ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయాల్లో మిత్రపక్షాలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించడమనే సిద్ధాంతాన్ని బీజేపీ మొదటి నుంచి ఆచరిస్తోందన్నారు. 2014, 2019 సంవత్సరాల్లో కేంద్రంలోని బీజేపీకి సొంత మెజార్టీ ఉన్నప్పటికీ మిత్రపక్షాలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించిందని రాజా గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఏయే పార్టీలను కలుపుకుని ప్రచారం చేస్తామో ఆ పార్టీలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించడం మంచిదేనని అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో పోటీ చేసిన గెలిచిన మిత్రపక్షాల సభ్యులకు రాజ్యసభ సభ్యత్వం కల్పించడం, లేదా మంత్రివర్గంలో స్థానం కల్పించే విషయాలపై ప్రధాని మోదీయే తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. ఇక సినిమాల్లో ప్రకాశించిన తర్వాత రాజకీయాల్లోనూ విజయం సాధిస్తామంటూ శపథాలు చేస్తూ రాజకీయ ప్రవేశం చేయడం చాలా పెద్ద తప్పు అని, ఈ విషయాన్ని ప్రజలు పలుమార్లు ఓడించి రుజువు చేశారని హెచ్ రాజా చెప్పుకొచ్చారు.



ఒప్పిలియప్పన్ సేవలో కుటుంబసమేతంగా పాల్గొన్న రాజా

వరదల్లో చిక్కుకున్న 150 మంది సురక్షితం

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాకాచ్చి అమ్మవారి ఆలయ ప్రాంతంలో కాట్రారు వరద ప్రవాహంలో చిక్కుకున్న 150 మందిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్ సమీపంలోని పశ్చిమ కనుమల కొండ శిఖరాన రాకాచ్చి అమ్మవారి ఆలయం ఉంది. ఈ ఆలయ సమీపంలో జలపాతం, నది ప్రవహిస్తున్నాయి. శుక్రవారం సెలవు రోజు కావడంతో అమ్మవారిని దర్శించుకొనేందుకు, జలపాతంలో స్నానం చేసేందుకు భక్తులు, పర్యాటకులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. మధ్యాహ్నం ఉన్నట్టుండి కురిసిన భారీ వర్షంతో ఆలయ సమీపంలోని నది ఉధృతంగా ప్రవహించింది. దీంతో, ఆలయానికి వెళ్లిన వారు నదిని దాటలేక అక్కడే చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న రాజపాళయం అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. మంసాపురం - రాకాచ్చి అమ్మవారి ఆలయ రోడ్డు మధ్యలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అందువల్ల ఈ ప్రాంతంలో భక్తులు వెళ్లేందుకు వీలుగా నిర్మించిన తాత్కాలిక వంతెన ఇటీవల భారీ వర్షాలతో కొట్టుకుపోయింది. ఈ క్రమంలో, వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేలా అగ్నిమాపక సిబ్బంది, రెండు వైపులా తాడును ఏర్పాటు చేసి ఒకరి తర్వాత ఒకరిని ఇవతల వైపుకు తరలించారు.

శిశువు పేరుతో జనన ధృవీకరణ పత్రం

●జీసీసీలో డిసెంబరు 31 వరకు వినతిపత్రాల స్వీకరణ

ప్యారీస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ హోంలలో జన్మించిన శిశువుల పేరుతో జనన ధృవీకరణ పత్రాలు పొందగోరు తల్లిదండ్రులు డిసెంబరు 31వ తేదిలోపు దరఖాస్తు సమర్పించుకోవచ్చని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ తెలిపింది. ప్రసూతి కేంద్రాల్లో జన్మించే శిశువుల తల్లిదండ్రులకు పుట్టిన 12 నెలల్లో శిశువు పేరు లేకుండానే జనన ధృవీకరణ పత్రాలు నమోదు చేస్తుంటారు. 12 నెలల అనంతరం శిశువు పేరును 15 సంవత్సరాల్లోపు రూ.200 ఫీజుగా చెల్లించి పేరుతో ఉన్న ధృవీకరణ పత్రాన్ని జీసీసీ నుంచి పొందవచ్చు. ఈ నేపథ్యంలో, శిశువు పేరు నమోదుకు కల్పించిన 15 సంవత్సరాల గడువు ముగిసిన తర్వాత కూడా పేరు నమోదు చేసుకోని తల్లితండ్రుల సౌకర్యార్థం భారత చీఫ్ రిజిస్ట్రార్ మరో ఐదేళ్లు అవకాశం కల్పించారు. ఈ అవకాశం డిసెంబరు 31వ తేదీతో ముగియనుందని, అందువల్ల జనన ధృవీకరణ పత్రం నకలు, పాఠశాల సర్టిఫికేట్, ఆధార్ కార్డు నకలు, ఓటరు కార్డు నకలు, రేషన్ కార్డు తదితరాలను జీసీసీ నిర్వహణలోని జోనల్ కార్యాలయాల్లో సమర్పించాల్సిందిగా తల్లిదండ్రులకు జీసీసీ కోరింది.

పళని పర్వతాలయం మెట్లెక్కిన 'కస్తూరి'



చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్కందషష్ఠి వేడుకల ప్రారంభోత్సవం సందర్భంగా పళని పర్వతాలయానికి కొండ దిగువన ఉండే ఆలయ ఏనుగు 'కస్తూరి' మెట్లెక్కి ప్రధాన ఆలయానికి చేరుకుంది. పళని దండాయుధపాణి ఆలయంలో స్కంధషష్ఠి వేడుకలు శనివారం ఉదయం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారికి ఉచ్చికాల పూజ అభిషేకం, అలంకారం నిర్వహించారు. ఆ తర్వాత వినాయకుడు, మూలవిరాట్టు, షణ్ముఖుడు, వళ్లి, దేవసేన, ద్వారపాలకులు, మయూరం, శూలాయుధం, నవవీరులకు కంకణధారణ మహోత్సవం జరిగింది. అంతుకు ముందు పర్వతాలయం దిగువన ఉన్న ఆలయ ఏనుగు కస్తూరి గజమార్గంలోని మెట్లెక్కి ఆలయాన్ని చేరుకుని వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

రోడ్డు ప్రమాదంలో 28 మందికి గాయాలు

వేళచ్చేరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం సమీపంలో మినీ వ్యాను బోల్తాపడిన ఘటనలో 28 మందికి గాయాలయ్యాయి. అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బయల్దేరిన మినీ వ్యాన్ హఠాత్తుగా అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ప్రయాణిస్తూ గాయపడిన 28 మందిని చుట్టుపక్కల వారు రక్షించి కాంచీపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కోవైలో వికసించిన బ్రహ్మకమలం



వేళచ్చేరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా కుడియలూరు సమీపంలో ఏడాదికి ఒకసారి రాత్రి సమయాల్లో మాత్రమే వికసించే బ్రహ్మకమలం పువ్వును చుట్టుపక్కల వారు ఆసక్తికరంగా చూస్తున్నారు. లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన గజలక్ష్మి భాస్కరన్ తన ఇంట్లో బ్రహ్మకమలం అనే నిషాగంధి పూల మొక్కను సంరక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఆ చెట్టుకు శుక్రవారం రాత్రి 5 పుష్పాలు వికసించడం గమనించారు. వెంటనే ఇంటిల్లిపాది పూలకు కర్పూర హారతులిచ్చి పూజలు చేశారు. ఈ సమాచారం అందుకున్న చుట్టుపక్కల వారు గజలక్ష్మి ఇంటికి చేరుకుని పూలను చూసి పరవశించారు.

పారిశ్రామికవేత్త ఇంటిలో బాలిక అనుమానాస్పద మృతి

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమింజికరై మెహతానగర్ ప్రాంతంలో పలు అంతస్థుల భవనంలో నివసిస్తున్న పారిశ్రామికవేత్త మహమ్మద్ నవాజ్‌కు చెందిన ఫ్లాట్‌లో 16 యేళ్ల బాలిక అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. తంజావూరుకు ఆ బాలిక యేడాదిగా ఆ ఇంట్లో పనిమనిషిగా ఉంటోంది. దీపావళి రోజున బాత్రూంలో స్నానానికి వెళ్లి బాలిక ఎంతసేపటికీ బయటకు రాలేదు. దీంతో మహమ్మద్ నవాజ్, ఆయన భార్య నివేదిక బాత్రూంను తెరచి చూడగా బాలిక నేలపై విగత జీవిగా కనిపించింది. దీనితో భీతిల్లిన ఇరువురూ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్ళి శుక్రవారం సాయంత్రం తిరిగొచ్చి లాయర్ ద్వారా అమింజికరై పోలీసులకు ఇంట్లో పనిమనిషిగా పనిచేస్తున్న బాలిక మృతి చెందిన విషయం గురించి ఫిర్యాదు చేశారు. ఆ బాలిక మృతదేహంపై గాయాలుండటంతో ఆమెపై దాడి జరిపి హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. 18 యేళ్లదాటిన వారినే ఇంటి పనిమనుషులుగా నియమించుకోవాలన్న నిబంధనలను అతిక్రమించి మహమ్మద్ నవాజ్ 16 యేళ్ల బాలికను పనిమనిషిగా నియమించుకోవటం చట్ట విరుద్ధమని పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం పోలీసులు మహమ్మద్ నవాజ్, ఆయన భార్య నివేదితాను విచారిస్తున్నారు.

హొగెనేకల్‌కు పోటెత్తిన పర్యాటకులు



హొగెనేకల్ జలపాతంలో దోనెల సవారీ చేస్తున్న పర్యాటకులు

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ వరుస సెలవుల కారణంగా ప్రముఖ పర్యాటక ప్రాంతం హొగెనేకల్‌కు శనివారం పర్యాటకులు పోటెత్తారు. ధర్మపురి, దాని పొరుగు జిల్లాల నుండే కాకుండా కర్ణాటక, పుదుచ్చేరి తదితర రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. కర్ణాటకలోని జలాశయ ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు అక్కడి జలాశయాల నుంచి అదనపు జలాలు విడుదల చేస్తున్నారు. దీంతో హొగెనేకల్ జలపాతంలోకి చేరే జలాల పరిమాణం అధికమైంది. ప్రస్తుతం సెకనుకు 6 వేల ఘనపుటడుగుల చొప్పున జలాలు ప్రవేశిస్తున్నాయి. దీంతో పర్యాటకులు దోనెల సవారీ చేస్తూ, కావేరి వాగు అందాలను వీక్షిస్తూ సందడి చేశారు. మెయిన్ జలపాతం, ఐందరువి, సినీ ఫాల్స్ తదితర ప్రాంతాలను కూడా సందర్శించారు. ఉద్యానవనాలలో చేపలపులుసుతో కూడిన వంటకాలను బడ్డీ దుకాణాలలో కొనుగోలు చేసి పర్యాటకులు కుటుంబ సమేతంగా ఆబగా ఆరగించారు.

దేవర్ బంగారు కవచం బ్యాంక్‌కు అప్పగింత

వేళచ్చేరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పసుమ్‌పొన్ ముత్తురామలింగ దేవర్ గురుపూజ సందర్భంగా గత నెల 25వ తేది మదురై అన్నానగర్‌లోని బ్యాంక్ నుంచి దేవర్ బంగారు కవచాన్ని అన్నాడీఎంకే కోశాధికారి దిండుగల్ శ్రీనివాసన్, దేవర్ మెమోరియల్ ఇన్‌చార్జి గాంధీమీనా తదితరులు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉత్సవాలు ముగియడంతో ఇరువురు శుక్రవారం మధ్యాహ్నం బంగారు కవచాన్ని బ్యాంక్‌లో అప్పగించగా, అధికారులు కవచాన్ని లాకర్‌లో భద్రపరిచారు.

దీపావళికి రూ.438 కోట్లకు పైగా మద్యం అమ్మకాలు

మదురై జోన్‌ని అధిగమించిన చెన్నై

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా దీపావళి పండుగను పురస్కరించుకుని మందుబాబులు పీకల దాకా టాస్మాక్ మద్యం తాగి ఆ సంస్థ ఆదాయాన్ని పెంచి పడేశారు. ఈ దీపావళిలో మద్యం అమ్మకాల్లో మదురై జోన్‌ను చెన్నై జోన్ అధిగమించింది. రాజధాని నగరం చెన్నైలోనే ఈ సారి మద్యం అమ్మకాలు అధికంగా జరిగినట్లు టాస్మాక్ గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 4829 మద్యం దుకాణాలున్నాయి. ఈ దుకాణాల్లో రోజూ సగటున రూ.150 కోట్లకు మద్యాన్ని విక్రయిస్తుంటారు. వారంతపు, సెలవు దినాల్లో ఆ అమ్మకాలు రూ.200 కోట్లకు పెరగడం ఆనవాయితీ. ఇక పండుగ సమయాల్లో రూ.250 కోట్ల దాకా మద్యం అమ్మకాలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఈ యేడాది దీపావళి సందర్భంగా అక్టోబరు 30న రూ.202.59 కోట్లు, 31 దీపావళి రోజున రూ.235.94 కోట్లుచొప్పున మొత్తం రూ.438.53 కోట్ల దాకా మద్యం అమ్మకాలు రాష్ట్రవ్యాప్తంగా జోరుగా సాగాయి. ఎప్పటివలెనే ఈ యేడాది కూడా ఎక్కువగా బ్రాందీయే అమ్ముడైంది. గతేడాది దీపావళికి రూ.467 కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరిగాయి. గతేడాదితో పోల్చుకుంటే ఈ యేడాది దీపావళి మద్యం అమ్మకాలు రూ.29.10 కోట్లు దాకా తగ్గాయని టాస్మాక్ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ అమ్మకాలు తగ్గటానికి దీపావళి నెలాఖరున రావటమే కారణమని పేర్కొంటున్నారు. ఇక సాధారణంగా పండుగ దినాల్లో మదురై జోన్‌లోనే ఎక్కువగా మద్యం అమ్మకాలు జరుగుతుంటాయి. ఈ యేడాది మద్యం అమ్మకాల్లో చెన్నై జోన్ మదురై జోన్‌ని మించిపోయింది. చెన్నై జోన్‌లో అక్టోబర్ 30న రూ.47.16 కోట్లకు, 31న దీపావళి రోజున 54.18 కోట్లకు మద్యం అమ్మకాలు జరిగాయి.

30 జిల్లాల్లో తగ్గిన భూగర్భ జలమట్టాలు

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సాగు, తాగునీటి కోసం నీరు వినియోగిస్తుండడంతో, 30 జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు తగ్గాయి. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న భూగర్భ, ఉపరితల జలవనరుల పరిశోధన కేంద్రం ప్రతినెలా భూగర్భ జలమట్టాలపై అధ్యయం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తోంది. అందుకోసం చెన్నై మినహా 37 జిల్లాల్లో పరిశోధన బావులు ఏర్పాటు చేసి గణన చేపడుతుంటారు. ఆ ప్రకారం, అక్టోబరు చివరి వరకు నిర్వహించిన అధ్యయనంలో కృష్ణగిరి, తిరుచ్చి, అరియలూరు, నీలగిరి, శివగంగ, తేని, తిరునల్వేలి తదితరాల జిల్లాల్లో మాత్రమే భూగర్భ జలమట్టాలు పెరిగాయి. ఈ జిల్లాల్లో కురిసిన వర్షాల కారణంగా భూగర్భ జలమట్టాలు పెరిగాయని, అది కూడా మీటరు తక్కువగా ఉన్నట్లు తెలిసింది. అదే సమయంలో, సాగు, తాగునీటి కోసం నీటిని విడుదల చేస్తుండడంతో తిరువళ్లూర్, కాంచీపురం, తిరువణ్ణామలై, వేలూరు, ధర్మపురి, కడలూరు సహా 30 జిల్లాల్లో జలమట్టాలు తగ్గాయి. ఈశాన్య రుతుపవనాల సీజన్ కావడంతో రాబోయే రోజుల్లో వర్షాలు కురిసి భూగర్భ జలమట్టాలు పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.

చైన్ స్నాచింగ్ వివరాలందించండి: డీజీపీ

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా చైన్ స్నాచింగ్, దోపిడీ ఘటనలు, నిందితులపై తీసుకున్న చర్యలను నివేదికగా సమర్పించాలని డీజీపీ శంకర్ జివాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు డీజీపీ పంపిన సర్క్యులర్‌లో... చైన్ స్నాచింగ్, దోపిడీలు జరిగిన ప్రదేశం ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంది. నేరం జరిగింది పగలా.. రాత్రా... నేరస్థుల వివరాలు, వారిపై ఇప్పటివరకు ఉన్న కేసులు... నేరస్తులపై తీసుకున్న చర్యలు, నేరానికి వినియోగించిన వాహనం, చోరీకి గురైన నగల విలువ, రికవరీ చేసుకున్న వస్తువులు తదితర వివరాలు సంబంధించి పోలీసులు, ఎస్పీలు, కమిషనర్లకు నివేదికగా పంపించాలని డీజీపీ ఆదేశించారు.

17న ఈపీఎస్‌కు సత్కారం

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మేట్టూరు కావేరి - సర్భంగా అదనపు జల ప్రవాహ పథకం కింద సేలం జిల్లాలో వంద చెరువులలో నీటిమట్టం పెరిగేలా రూ.565 కోట్ల వ్యయంతో అదనపు జలాల పథకాన్ని అమలు చేసినందుకుగాను అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)ని ఈ నెల 17 రైతు సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించనున్నారు. మేట్టూరు, ఎడప్పాడి, శంకగిరి తదితర ప్రాంతాలకు చెందిన రైతులు పాల్గొని ఈపీఎస్‌ని సన్మాంచి ప్రసంగించనున్నారు.

21 శాతం అదనపు వర్షపాతం

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలతో ఈనెల 2వ తేది శనివారం ఉదయం వరకు సాధారణం కన్నా 21 శాతం అదనపు వర్షపాతం నమోదైంది. అక్టోబరు 1 నుంచి శనివారం వరకు సాధారణ వర్షపాతం 185.5 మి.మీ కాగా, ప్రస్తుతం 225.3 మి.మీ నమోదైంది. అలాగే, చెన్నైలో ఈశాన్య 25 శాతం అదనపు వర్షపాతం నమోదైందని వాతావరణ కేంద్రం తెలిపింది.

వైభవంగా అంకాళమ్మ ఊంజల్ ఉత్సవం

● మేల్‌మలయనూరుకు పోటెత్తిన భక్తజనం

ప్యారీస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా మేల్ మలయనూరులో ప్రసిద్ధిగాంచిన అంకాళమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన అమావాస్య ఊంజల్ ఉత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమావాస్య పూజలకు ఈ ఆలయం పేరొందింది. ఐపసి నెల అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారు జామున మూలవర్ అమ్మవారికి పాలు, పెరుగు, చందనం, నారీకేళజలం, సుంగధద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని సుందరంగా అలంకరించి మహా దీపారాధన చేపట్టారు. అనంతరం ఉత్సవ మూర్తిని మహాలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి 10.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో వేలాది మంది భక్త జనం దివ్యనామస్మరణల మధ్య ఆలయ అర్చకులు ఉయ్యాల వేదిక వద్దకు అమ్మవారిని పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్లి, కీర్తనలు ఆలపిస్తూ ఊయలపై అధిష్ఠింపజేసి పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలివెళ్లడంతో మేల్‌మలయనూరు క్షేత్రం కిటకిటలాడింది. రాష్ట్ర రవాణా సంస్థలు పలు జిల్లా కేంద్రాల నుంచి మేల్‌మలయనూరుకు ప్రత్యేక బస్సులు నడపగా, 600 మందికి పైగా పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు.

10న 'అ...ఆ...ఇ...ఈ' రాత పరీక్ష

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'నవ భారత అక్షరాస్యత' కార్యక్రమం కింద ప్రాథమిక విద్య అభ్యసించిన 5.09 లక్షల మంది ఈ నెల 10న 'అ...ఆ...ఇ...ఈ' రాత పరీక్ష రాయనున్నారు. రాష్ట్రంలో 15 ఏళ్లకు పైబడిన నిరక్షరాస్యులకు ప్రాథమిక అక్షరాస్యత విద్య అందించేలా 2022-23 నుంచి నవ భారత అక్షరాస్యత కార్యక్రమం అమలులో ఉంది. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 16 లక్షల మంది లబ్ధిపొందారు. కాగా ఈ విద్యా సంవత్సరం (2024-25)లో 6.14 మందిని నిరక్షరాస్యులుగా గుర్తించారు. వారిలో 5.09 లక్షల మంది ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన 30,113 విద్యార్థి అక్షరాస్యత కేంద్రాల్లో నమోదు చేసుకోగా, వారికి వలంటీర్లచే విద్యా బోధన, అభ్యాస శిక్షణ అందిస్తున్నారు. రెండో విడత శిక్షణ నవంబరు నుంచి 2025 మార్చి వరకు జరుగనుంది. తొలివిడతలో ప్రాథమిక శిక్షణ పొందిన 5,09,459 మందికి ఈనెల 10వ తేది ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 3 గంటల పాటు రాత పరీక్ష నిర్వహించనున్నారు.. తమిళంలో 'అ...ఆ...ఇ...ఈ', ఇంగ్లీషులో 'ఏ...బి...సి...డి', బేసిక్ మ్యాథ్స్ తదితర ప్రశ్నలతో పరీక్ష ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కొలనులో మునిగి ఇద్దరు బాలుర మృతి

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సెమ్మంజేరి సమీపంలో ఉన్న కొలనులో మునిగి ఇద్దరు బాలురు మృతి చెందారు. తాళంబూరు అన్నా వీధికి చెందిన శ్రీసుధన్ (13), జస్వంత్ (12) సమీపంలోని ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. శుక్రవారం సాయంత్రం స్నేహితులతోపాటు సెమ్మంజేరి వాళవెట్టితాంగళ్ కొలను వద్దకు వెళ్లారు. ఆ సమయంలో శ్రీసుధన్, జస్వంత్ కొలనులో స్నానం చేయడానికి దిగారు. ఇద్దరికీ ఈత రాకపోవటంతో కొలనులో దిగిన కాసేపటికల్లా మునిగారు. దీంతో కొలను గట్టుమీదున్న స్నేహితులు భయంతో కేకలు పెట్టడంతో చేపలు పడుతున్న ఇద్దరు కొలనులోకి దిగి ఇద్దరినీ ఒడ్డుకు చేర్చారు. ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌ను రప్పించారు. అంబులెన్స్ వైద్యులు పరీక్షించి అప్పటికే వారు మృతి చెందినట్లు ధృవీకరించారు. సెమ్మంజేరి పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం రాయపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పెరంబూర్, కోట్టూరుపురం రైల్వేస్టేషన్లలో పార్కింగ్ వసతి

ప్యారీస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూర్, కోట్టూరుపురం, అరక్కోణం సహా 24 రైల్వేస్టేషన్లలో వాహనచోదకుల సౌకర్యార్థం త్వరలో పార్కింగ్ వసతి కల్పించనున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. దక్షిణ రైల్వే పరిధిలో చెన్నై, తిరుచ్చి, మదురై, సేలం, పాల్ఘాట్, త్రివేండ్రం అనే ఆరు రైల్వే డివిజన్లు ఉండగా, వీటిలో సుమారు 700కు పైగా రైల్వేస్టేషన్లున్నాయి. వీటిలో చెన్నై సెంట్రల్, ఎగ్మోర్, తాంబరం, అరక్కోణం, తిరుచ్చి, మదురై, కోవై తదితర 200కు పైగా రైల్వేస్టేషన్లలో ప్రస్తుతం పార్కింగ్ వసతి అందుబాటులో ఉంది. ఇదిలా ఉండగా, మరో 24 రైల్వేస్టేషన్లల్లో ఈ వసతి కల్పించే పనులను రైల్వే శాఖ ప్రారంభించింది. సెవ్వాపేట రోడ్డు, కొరుక్కుపేట, మధురాంతకం, సెయింట్ థామస్ మౌంట్, తడ, తరమణి, కాట్పాడి, అరక్కోణం, పెరంబూర్ తదితర ప్రాంతాల్లో పార్కింగ్‌కు సంబంధించిన టెండర్లు ఆహ్వానించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

భర్త దాడి పళ్ల సెట్ గొంతులో ఇరుక్కుని మహిళ మృతి

ప్యారీస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా వాసుదేవ నల్లూర్ కలైంజర్ కాలనీలో భర్త దాడిలో పళ్ల సెట్ గొంతులో ఇరుక్కుని భార్య మరణించినట్లు పోలీసులు తెలిపారు. కలైంజర్ కాలనీకి చెందిన తిరుమలస్వామి- శశికళ (35) దంపతులు తరచూ గొడవ పడుతుండేవారు. దీపావళి పండుగ రోజున జరిగిన గొడవలో తిరుమలైస్వామి ఇనుప కుర్చీతో భార్యపై దాడి చేశాడు. దీంతో ఆమె కట్టుడు పళ్ల సెట్ గొంతులో ఇరుక్కుని స్పృహకోల్పోయారు. ఆమెను ఇరుగుపొరుగు వారు పులియంగుడిలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే ఆమెను పరీక్షించిన వైద్యులు, శస్త్రచికిత్స ద్వారా గొంతులో చిక్కుకున్న పళ్ల సెట్‌ను తొలగించేందుకు ప్రయత్నించారు. అయితే చికిత్స ఫలించక ఆమె మృతి చెందారు. పోలీసులు తిరుమలస్వామిని అరెస్ట్ చేశారు.

కేరళలో ఎక్స్‌ప్రెస్ ఢీకొని నలుగురు పారిశుధ్య కార్మికుల మృతి

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలో ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొన్న ఘటనలో తమిళనాడు రాష్ట్రం విల్లుపురానికి చెందిన ఇద్దరు మహిళలు సహా నలుగురు మృతి చెందారు. విల్లుపురానికి చెందిన లక్ష్మణన్, రాణి, వల్లి సహా నలుగురు రైల్వే పారిశుధ్య కార్మికులు. వీరు శనివారం మధ్యాహ్నం షోరనూర్‌లోని పాలక్కాడు - షోరనూరు సమీపం భారతపుళ నదిపై ఉన్న రైల్వే వంతెనపై రైలు మార్గంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఆ సమయంలో ఢిల్లీ నుంచి తిరువనంతపురం వైపుకు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో వారు సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటనలో లక్ష్మణన్, రాణి, వల్లి మృతదేహాలు రైలు పట్టాల పక్కన పడగా, మరో మృతదేహం నదిలో కొట్టుకుపోయింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాల ప్రభుత్వాసుపత్రి తరలించి, నదిలో కొట్టుకుపోయిన వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

షార్జా నుంచి వచ్చిన యువకుడికి మంకీ ఫీవర్

ప్యారీస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): షార్జా నుంచి విమానంలో తిరుచ్చికి తిరిగొచ్చిన యువకుడికి మంకీ ఫీవర్ లక్షణాలున్నట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా మహమ్మారి అనంతరం మంకీ ఫీవర్ వేగంగా వ్యాప్తి చెందుతుండడంపై ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వివిధ దేశాల నుంచి తిరిగొచ్చే వారి వల్ల మళ్లీ మంకీ ఫీవర్ ప్రబలుతున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో, షార్జా నుంచి తిరుచ్చి విమానాశ్రయానికి చేరుకున్న యువకుడి రక్త నమూనాలను సేకరించిన వైద్యులు, నిర్వహించిన పరీక్షల్లో అతనికి మంకీ ఫీవర్ లక్షణాలున్నట్లు గుర్తించారు. దీంతో ఆ యువకుడిని తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలందిస్తున్నారు.

విదేశీ మారకద్రవ్యం కేసులో ప్రైవేటు కంపెనీలకు రూ.566 కోట్ల జరిమానా

వేళచ్చేరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విదేశీ మారకద్రవ్య మోసానికి పాల్పడిన ప్రైవేటు కంపెనీలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రూ.566.5 కోట్ల జరిమానా విధించింది. స్థానిక గిండిలో స్టాక్ ట్రేడింగ్ చేసే 'జీఐ ప్రైవేట్ లిమిటెడ్' అనుబంధ సంస్థగా 'హేర్మ్స్ ఐ టిక్కెట్ ప్రైవేట్ లిమిటెడ్' పని చేస్తోంది. కొన్ని వారాల క్రితం, ఈ సంస్థకు చెందిన షేర్లను భారీగా మారిషస్‌లోని ఓ కంపెనీకి బదిలీ చేశారు. అక్కడి నుంచి యూఏఈలోని భారతీయుడికి షేర్లు విక్రయించారు. దీని ద్వారా ప్రైవేటు కంపెనీలు రూ.195 కోట్ల లాభాలు ఆర్జించాయి. ఈ చర్యలు ఫారిన్ ఎక్స్ఛేంజ్ ఫ్రాడ్ యాక్ట్ కింద వస్తుంది. దీంతో, చెన్నై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రెండు కంపెనీలపై కేసు నమోదు చేసి రూ.566.5 కోట్ల జరిమానా విధించింది.

చిన్ననాటి కల నెరవేరేందుకు
15 ఏళ్లు హోటల్ పనులు!



ఎళిలరసి



మెస్‌లో వంట చేస్తున్న ఎళిలరసి



- ఆ తరువాత సొంతంగా మెస్
- వేళచ్చేరిలో ఎళిలరసి పాకశాల

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తరతరాలుగా హోటళ్లు నడిపినవారంతా తమ వారసులకు అదే పనిని కులవృత్తిగా విడిచివెళ్తుంటారు. కొంతమందికి హోటల్ నడపాలనే ఆశ పుడుతుంది. అలాంటి వారంతా హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదివి, ఆ పాఠాల ప్రాతిపదికగా వంటకాలు వండి రెస్టారెంట్ నడుపుతుంటారు. మరికొంతమంది ఏదో ఒక వ్యాపారం చేయాలనుకుని చివరగా హోటల్ నడపటమే సంపాదనకు సరైన మార్గమనకుని ప్రారంభిస్తారు. అయితే ఇవేవీ లేకుండా హోటల్‌ను నడపాలన్న గట్టి నిర్ణయంతో పదిహేను సంవత్సరాల పాటు ఓ రెస్టారెంట్‌లో పనిచేసి, అందులోని కష్టనష్టాలను ఔపోసన పట్టిన ఓ మహిళ వేళచ్చేరిలో సొంతంగా ఓ మెస్ నడుపుతోంది. ఆమే సీర్గాళికి చెందిన ఎళిలరసి. వేళచ్చేరి పరిసర ప్రాంతాలకు చెందిన కస్టమర్లకు రుచికరమైన వంటలను వడ్డించి ప్రశంసలందుకుంటున్నారు. వేళచ్చేరిలో 'ఈరోడ్ అణ్ణామలైయార్ మెస్' పేరుతో నడుపుతున్న ఆ భోజనశాలకు ప్రస్తుతం వేల సంఖ్యలో కస్టమర్లు ఉన్నారు.

చిన్ననాటి కోరిక... : చిన్నప్పటి నుంచే ఎళిలరసికి వంట చేయడమంటే చాలా ఇష్టం. ఇంట్లో ఏదైనా విశేషం, పండుగో పబ్బమో జరిగితే ఆమె వంటలు చేసేది. అదే సమయంలో తాను వండిన ఆహార పదార్థాలను తానే ముందుండి వడ్డించేది. తన వంటకాలను తింటున్నవారిని చూసి సంతోషపడేది. ఈ కారణాల వల్ల ఆమెకు పెద్దయితే హోటల్ నడపాలనే ఆశ పుట్టింది. ఆ ఆశ ఎన్నో యేళ్ల తర్వాతే నెరవేరింది.



పుల్కాలు, నాన్‌లు

ప్రారంభంలో సర్వర్‌లా...

ఎళిలరసి స్వస్థలం సీర్గాళి, భర్త ఈరోడ్‌కు చెందినవారు. పెళ్లయ్యాక బతుకు తెరువు కోసం చెన్నైకి చేరుకున్నారు. ఇద్దరూ నగరంలోని ప్రముఖ హోటల్‌లో చేరారు. ప్రారంభంలో సర్వర్‌లా పనిచేసి ఆ తర్వాత అన్ని పనుల్లో అనుభవం సాధించారు ఎళిలరసి. వంటంటే ఇష్టం కనుక ఆ హోటల్‌లో రుచికరమైన వంటలు కూడా చేసేది. హోటల్‌ని ఎలా నడపాలి... కస్టమర్లతో ఎలా మెలగాలన్న విషయాలను అపోసన పట్టింది. వంటలు చేయడం, వాటిని కస్టమర్లకు వడ్డించే తీరు క్షుణ్ణంగా నేర్చుకుంది. ఇక సొంతంగా హోటల్ ప్రారంభిద్దామని అంతా సిద్ధం చేసుకున్నాక కరోనా మహమ్మారి ఆమె ప్రయత్నానికి అడ్డుకట్ట వేసింది. దీంతో యేడాదికి పైగా ఇంటికే పరిమితమై తెలిసిన వాళ్లకు ఇంట్లోనే రుచికరమైన ఆహార పదార్థాలు వండి డెలివరీ చేసింది. ఆ వంటకాలు తిన్నవారంతా ఆమెను మెచ్చుకోవటంతో హోటల్‌ను నడపగలననే ధైర్యం ఎళిలరసికి వచ్చింది.

అన్నామలయార్ మెస్ పేరుతో...

వేళచ్చేరిలో ఈరోడ్ అన్నామలయార్ మెస్ పేరుతో భోజనశాలను ప్రారంభించారు. ఐటెక్స్ విషయంలో నాణ్యతను పాటించడమే తన విద్యుక్తధర్మంగా భావించి ఇంటి భోజనాన్ని తలపించేలా కస్టమర్లకు మాంసాహార వంటకాలను అందించడంతో అనతి కాలంలోనే ఆ భోజనశాలకు మంచి పేరొచ్చింది. తమ భోజనశాలకు వచ్చే కస్టమర్లను బంధువులను ఆహ్వానించినట్లు వారిని లోపలకు ఆహ్వానించి వారికి నచ్చిన వంటకాలను అందిస్తున్నట్లు ఎళిలరసి చెబుతున్నారు. తమ భోజనశాలలో తాను, తన కుటుంబ సభ్యులే పని చేస్తున్నామని, ఎవరిని పని మనుషులుగా పెట్టుకోలేదన్నారు. ఇక వంటలలో వాడే మసాలా వస్తువులన్నింటినీ తామే తయారు చేసి వాడుతున్నామని చెప్పారు. తాము తయారు చేసే మసాలా వస్తువులు ఎవరు వాడినా ఒకే రకమైన రుచినే అందిస్తాయన్నారు. మాంసాహార వంటకాలలో చేపలు, రొయ్యలు, పీతలు, కోడి మాంసం, మేకమాంసం ఉన్నాయని, తమ భోజనశాలలో ఫిష్ రోస్ట్ (చేపలవేపుడు) ఫేమస్ అని చెప్పారు. ఫిష్-65 కూడా తమ భోజనశాలలో లభిస్తుందన్నారు. చికెన్, మటన్ బిర్యానీలన్నీ కొంగు బాణీలోనే తయారు చేస్తున్నామన్నారు.





దమ్ పరోటా

తరుణి

దమ్ పరోటా...

మట్టిపాత్రలో చేసే దమ్ పరోటా కూడా తమ భోజనశాల స్పెషల్ ఐటెం అన్నారు. మట్టిపాత్రలో మూడు లేయర్లుగా పరోటాలు పేర్చి, దానికంటూ తయారు చేసే గ్రేవీ, చికెన్ చుక్కా, జీడిపప్పు అన్ని కలిసి పొయ్యిపైన పెట్టి కొద్ది నిమిషాలు వేడి చేసి కస్టమర్లకు వేడివేడిగా అందిస్తున్నామన్నారు. ఈ భోజనశాలను ప్రారంభించడంతో తమకున్న కస్టమర్లంతా ఆత్మీయ బంధువులుగా మారారని ఎళిలరసి తెలిపారు. ప్రస్తుతం తమ భోజనశాల వేళచ్చేరి ల్యాండ్ మార్క్‌గా మారిందంటే అతిశయోక్తి కాదని, ఈ పేరు రావటానికి తమ కస్టమర్లే కారణమని సంతోషం వ్యక్తం చేశారు.

వైద్యురాలిగా యాషికా ఆనంద్



కొత్త చిత్రం పూజా కార్యక్రమం

హీరోయిన్ యాషికా ఆనంద్ వైద్యురాలి పాత్రలో నటించనున్నారు. మాజీ సైనికోద్యోగి ఎం.ఎ.బాలా దర్శకత్వంలో రూపొందే ఈ చిత్రాన్ని ట్వింకిల్ ల్యాబ్స్ ప్రొడక్షన్స్ బ్యానరుపై ఆయనే నిర్మించనున్నారు. సంప్రదాయ పూజా కార్యక్రమంతో దీపావళి పండుగ రోజున చిత్రాన్ని ప్రారంభించారు. రాంప్రసాద్ అనే వైద్యుడు హీరోగా నటిస్తున్నారు. మిస్టరీ థ్రిలర్ జానర్‌లో రూపుదిద్దుకోనుంది. హీరోహీరోయిన్లు ఇద్దరూ వైద్యుల పాత్రల్లో కనిపించనున్నారు. డేవిడ్ భాస్కర్ ఛాయాగ్రహణం అందించే ఈ చిత్రానికి విపిన్ ఆర్ సంగీతం సమకూర్చనున్నారు. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ సినిమా చెన్నై, దాని పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకోనుంది.



మాళవిక మోహనన్

సుదీర్ఘ కల నెరవేరింది

- మాళవికా మోహనన్

తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టాలన్న సుదీర్ఘ కల ఇప్పటికి నెరవేరిందని హీరోయిన్ మాళవికా మోహనన్ అన్నారు. ఈ ఎంట్రీ కూడా ఎంతో గ్రాండ్‌గా ఉందని పేర్కొన్నారు. 'పేట' చిత్రంతో కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ మలయాళ బ్యూటీ ఆ తర్వాత విజయ్, ధనుష్ వంటి హీరోల సరసన నటించారు. కానీ, ఏ ఒక్క చిత్రం కూడా ఆమెకు సరైన బ్రేక్ ఇవ్వలేదు. అదే సమయంలో సినీ అవకాశాలు కూడా ఆశించిన స్థాయిలో రాలేదు. ఈ క్రమంలో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టేందుకు ఆమె చేసిన కృషి ఎట్టకేలకు ఫలించింది. ఫలితంగా ప్రభాస్ హీరోగా తెరకెక్కిన 'రాజాసాబ్' మూవీలో హీరోయిన్‌గా అవకాశం దక్కించుకుని నటించారు. దీనిపై ఆమె స్పందిస్తూ, 'సరైన చిత్రం ద్వారా తెలుగులోకి అడుగుపెట్టాలన్న నా చిరకాల కోరిక ఎట్టకేలకు నెరవేరింది. 'బిగ్‌బాస్' అవకాశం లభించినప్పటికీ ఈ ఆఫర్ కంటే టాలీవుడ్‌లో ఎంట్రీనే నాకు ప్రధానం. ఇంతకంటే గొప్ప డెబ్యూ నాకు లభించదు. ఈ మూవీ కోసం అభిమానుల తరహాలోనే నేను కూడా ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాను' అని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి



రిపబ్లిక్ డే రోజున ఇళయరాజా సింఫోనీ మ్యూజిక్ రిలీజ్

'ఇసైజ్ఞాని' ఇళయరాజా స్వర పరుస్తున్న సింఫోనీ మ్యూజిక్‌ను వచ్చే యేడాది జనవరి 26న భారత గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని ఇళయరాజా తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. ఇదే విషయంపై ఆయన పోస్ట్ చేసిన ట్వీట్‌లో.. 'అందరికీ దీపావళి శుభాకాంక్షలు. ఈ రోజు నా సింఫోనీ మ్యూజిక్‌ను రికార్డు చేశాను. వచ్చే యేడాది జనవరి 26వ తేదీన విడుదలకానుంది. ఈ విషయాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంగీత ప్రియులకు సంతోషంగా తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు. గత మే నెలలో చేసిన ఓ ట్వీట్‌లో 'మీరంతా నన్ను ఆదరిస్తూనే ఉంటారు. గత నెలలోనే ఒక సింఫోని రాయడం పూర్తి చేశాను. మధ్యమధ్యలో సినిమా సంగీతం, సంగీత విభావరిలపై దృష్టి సారించాల్సి ఉంది. అంత బిజీ సమయంలోనూ ప్యూర్ సింఫోనీగా రాయడం పూర్తి చేశాను' అని పేర్కొన్నారు.

'ఇడ్లీ కడై' హీరోగా అరుణ్ విజయ్

అగ్ర హీరో ధనుష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఇడ్లీకడై'లో హీరోగా అరుణ్ విజయ్‌ను ఎంపిక చేశారు. ఈ మూవీ వచ్చే యేడాది వేసవి సెలవుల్లో ప్రేక్షకుల ముందుకురానుంది. హీరో ధనుష్.. ఒకవైపు హీరోగా రాణిస్తూనే మరోవైపు దర్శకత్వం వహించడమేకాకుండా నిర్మాతగా చిత్రాలను నిర్మిస్తున్నారు. ఇటీవల ఆయన 'రాయన్' వంటి హిట్ చిత్రానికి దర్శకత్వం వహించడంతో పాటు దర్శకత్వం వహించారు. ఈ నేపథ్యంలో తన సొంత బ్యానరుపై 'ఇడ్లీ కడై' పేరుతో మరో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. ఇందులో హీరోయిన్ నిత్యా మీనన్ ప్రధాన పాత్రను పోషిస్తుండగా, హీరోగా అరుణ్ విజయ్‌ను ఖరారు చేశారు. కిరణ్ కౌశిక్ ఛాయాగ్రహణం అందించే ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం. ఇందులో ధనుష్ అతిథి పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే తేని, పొల్లాచ్చి తదితర ప్రాంతాల్లో సినిమాలోని ప్రధాన సన్నివేశాలను చిత్రీకరించారు. త్వరలోనే చెన్నైతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో షూటింగ్ ప్రారంభించనున్నారు. చివరి దశ షూటింగ్‌ను దుబాయ్‌లో ప్లాన్ చేస్తున్నారు. అలాగే, ధనుష్ 'నిలవుక్కు ఎన్‌మేల్ ఎన్నడి కోబం' అనే చిత్రానికి కూడా దర్శకత్వం వహిస్తున్న విషయం తెల్సిందే.



ధనుష్ - అరుణ్ విజయ్



శనివారం చెన్నైలో 'అమరన్' చిత్రాన్ని వీక్షించి, ఆ చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్న సూపర్‌స్టార్ రజనీకాంత్

ధనుష్, ఐశ్వర్య విడాకుల కేసు 21వ తేదీకి వాయిదా

ప్యారీస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు ధనుష్ - ఐశ్వర్య దంపతులు విడాకులు కోరుతూ దాఖలు చేసిన కేసు విచారణ ఈ నెల 21వ తేదీకి వాయిదా వేస్తూ చెన్నై కుటుంబ సంక్షేమ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ పెద్దకుమార్తె ఐశ్వర్యకు సినీ దర్శకుడు కస్తూరిరాజా కుమారుడు, నటుడు ధనుష్‌కు రెండు కుటుంబాల పెద్దల సమక్షంలో 2004 నవంబరు 18న వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. సుమారు 18 ఏళ్లు సంతోషంగా జీవనం సాగించిన ఈ దంపతుల మధ్య విభేదాలు తలెత్తడంతో వారు విడిపోయారు. ఈ నేపథ్యంలో, 2022లో వారు తమ ట్విట్టర్ పేజీలో తాము విడిపోయినట్లు బహిరంగంగా పోస్ట్ చేశారు. ఇదిలా ఉండగా, విడాకులు కోరుతూ ధనుష్, ఐశ్వర్య చెన్నై కుటుంబ సంక్షేమ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్ రెండోసారి శనివారం న్యాయమూర్తి శుభాదేవి సమక్షంలో విచారణకు వచ్చింది. అయితే విచారణకు ఈ జంట హాజరుకానందువల్ల తదుపరి విచారణ ఈ నెల 21వ తేదీకి న్యాయమూర్తి వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

మార్చిలో కుత్తంబాక్కం బస్‌స్టేషన్ ప్రారంభం

చెన్నై, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుత్తంబాక్కం బస్‌స్టేషన్ మార్చిలో ప్రారంభమవుతుందని రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ మంత్రి, సీఎండీఏ ఇన్‌ఛార్జి మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. శనివారం ఉదయం ఆయన మాధవరం బస్‌స్టేషన్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆ తర్వాత కొళత్తూరులోని అగరం జగన్నాథన్ రోడ్డులో ఉద్యోగం చేస్తూ చదువుకునే వారి కోసం నిర్మించిన 'ముదల్వర్ పడైప్పగం' భవన నిర్మాణ పనులను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముడిచ్చూరులో రూ.42 కోట్లతో నిర్మించిన ఆమ్నీ బస్‌స్టేషన్‌ను త్వరలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారని చెప్పారు. ఇక కుత్తంబాక్కం బస్‌స్టేషన్ నిర్మాణ పనులు మునుపటి ప్రభుత్వ హయాంలో నత్తనడక సాగాయని, ప్రస్తుతం వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. వచ్చే మార్చికల్లా ఆ బస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తామని తెలిపారు.



మాధవరం బస్‌స్టేషన్‌ను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు



స్థానిక కీల్పాక్కం సమాధుల తోటలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఫాదర్లు - సమాధి వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తూ ప్రార్థిస్తున్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో సమాధుల పండుగ

ప్యారీస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని క్రైస్తవ సమాధుల వాటికల్లో శనివారం సమాధుల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాలం చేసిన తమ వారిని స్మరించుకుంటూ సమాధులకు రంగులు వేసి, పూలతో అందంగా ముస్తాబు చేసి, కొవ్వొత్తులు వెలిగించారు. దివంగతలకు ఇష్టమైన ఫలహారాలు సమాధులపై ఉంచి ప్రార్థించిన అనంతరం కుటుంబ సభ్యులందరూ ప్రసాదంగా స్వీకరించారు. కాగా, యేటా నవంబరు 2న సమాధుల పండుగను క్రైస్తవులు పాటించడం ఆనవాయితీ. ఈ ఏడాది శ్మశానవాటికలో పిచ్చిమొక్కలు తొలగించి, గోడలకు రంగులేశారు. స్థానిక శాంథోమ్, పెరంబూర్, కీల్పాక్కం, బిసెంట్‌నగర్, కాశిమేడు, తాంబరం, అన్నానగర్, మాధవరం, కొడుంగైయూర్, మైలాపూర్, సైదాపేట ప్రాంతాల్లో ఉన్న సమాధుల తోటలు, క్రైస్తవ సంస్థల నిర్వహణలోని సమాధుల్లో శనివారం ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలకు క్రైస్తవులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. నాగపట్టినం జిల్లాలో ప్రపంచ ప్రసిద్ధిచెందిన వేలాంకన్ని దివ్యక్షేత్రంలో బిషప్‌లు, ఫాదర్లు దివంగతుల కుటుంబసభ్యులతో కలసి వారి ఆత్మలు శాంతించాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. పలు ప్రాంతాల్లో దివంగతుల పేరుతో అన్నదానం, వస్త్రదానం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

కురంగణి కొండపై ట్రెక్కింగ్ శిక్షణ ప్రారంభం

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా బోడి సమీపంలోని కురంగణి కొండపై ట్రెక్కింగ్ శిక్షణ శుక్రవారం మళ్లీ ప్రారంభమైంది. కురంగణి నుంచి టాప్ స్టేషన్, కొళుక్కుమలై తదితర కొండ గ్రామాలకు దేశంలోని వివిధ ప్రాంతాలు, విదేశాలకు చెందిన వారు వచ్చి ట్రెక్కింగ్ (కొండలు ఎక్కే శిక్షణ) చేపడుతుంటారు. ఈ నేపథ్యంలో 2018 మార్చి 11వ తేది కొళుక్కుమలై ప్రాంతంలో సంభవించిన అగ్నిప్రమాదంలో చిక్కుకొని 20 మంది మృత్యువాతపడ్డారు. ఈ ఘటనతో రాష్ట్రవ్యాప్తంగా ట్రెక్కింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. తాజాగా ట్రెక్కింగ్ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు రకాల మార్గదర్శకాలు సూచించింది. అలాగే, తేని, దిండుగల్ సహా 14 జిల్లాల్లో ట్రెక్కింగ్ శిక్షణకు అనుమతులిచ్చింది. ట్రెక్కింగ్ చేపట్టేవారు ముందుగానే పేర్లు నమోదు చేసేలా నూతన వెబ్‌సైట్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ గత నెల 24వ తేది ప్రారంభించారు. తేని జిల్లాలో చిన్నసురుళి, కారప్పారై, కురంగణి సాంబలారు తదితర మూడు ప్రాంతాల్లో కొండలు ఎక్కే శిక్షణ శిక్షణకు అనుమతించారు. ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్న వారికి ఈనెల 1వ తేది నుంచి ట్రెక్కింగ్ శిక్షణ ప్రారంభించారు. కురంగణి సాంబలారు ప్రాంతంలో ట్రెక్కింగ్‌కు నలుగురు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు ముదువాకుడి గిరిజన గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను నియమించారు. వీరు కురంగణి నుంచి మేల సాంబలారు జలపాతం చేరుకొని, అక్కడి నుంచి అటవీ శాఖ గెస్ట్ హౌస్ మీదుగా మళ్లీ కురంగణి చేరుకుంటారు. 5 కి.మీ దూరం కలిగిన ఈ శిక్షణకు రూ.1,300 ఛార్జీగా నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకొని ట్రెక్కింగ్‌కు వచ్చే వారి భద్రత, సురక్షిత శిక్షణ అందించేలా ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.



శిక్షణలో పాల్గొన్న సభ్యులు, కోచ్‌లు

సముద్రంలో సరిహద్దులు తెలుసుకొనేలా

- మరపడవలకు ప్రత్యేక పరికరం

పెరంబూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా కోట్టైపట్టణం, జగదాంబపట్టణం జాలర్లు చేపలు పట్టేందుకు సముద్రంలోకి వెళ్లిన సమయంలో, సరిహద్దులు తెలుసుకొనేలా మరపడవలకు 'ట్రాన్స్‌పాండర్' అనే పరికరం అమర్చే పనులను అధికారులు చేపట్టారు. చేపల వేటకు వెళ్లే జాలర్లు సముద్ర సరిహద్దులు తెలుసుకొనేలా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఈ పరికరాన్ని అభివృద్ధి చేసింది. ఈ పరికరాలను రాష్ట్ర జాలర్ల మరపడవలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. ఆ ప్రకారం, పుదుకోట జిల్లాకు తొలివిడతగా 288 ట్రాన్స్‌పాండర్లు అందజేశారు. బ్లూటూత్ ద్వారా ఈ పరికరాన్ని అనుసంధానం చేసి, మొబైల్ ఫోన్‌లోని యాప్ ద్వారా సమాచారం పొందవచ్చు. అలాగే, తీరం నుంచి సముద్రంలోకి వెళ్లిన జాలర్లతో సంప్రదింపులు జరపవచ్చు. సముద్రంలో పడవ వెళ్లే మార్గాన్ని సూచించే ఈ పరికరం, దేశ సరిహద్దులు దాటిన వెంటనే హెచ్చరికలు జారీ చేస్తుంది. తుఫానులు, భారీ వర్షాల్లో నడిసముద్రంలో పడవలు చిక్కుకుంటే, సముద్రం నుంచి పడవ యజమానులు, మత్స్య శాఖ అధికారులు, కంట్రోల్ రూమ్‌కు అత్యవసర సమాచారం పంపుతుంది. అలాగే, మత్స్యశాఖ, భద్రతా సంస్థలు, తీరాన ఉన్న పడవ యజమానులు అత్యవసర సందేశాన్ని కూడా స్వీకరించవచ్చు. ఇక, చేపలు అధికంగా ఉండే ప్రాంతాలు, వాతావరణ పరిస్థితులు, నడిసముద్రంలో మరమ్మతులకు గురై నిలిచిన పడవ ప్రాంతాన్ని కూడా అధికారులకు తెలిపేందుకు ఈ పరికరం ఎంతో ఉపయోగకంగా ఉంటుందని జాలర్లు తెలిపారు.




పడవలకు అమర్చిన ట్రాన్స్‌పాండర్ పరికరం

ఆదివారం ప్రత్యేకం

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి అలంకార ప్రియుడే కాదు, మంచి భోజన ప్రియుడు కూడా. ఈ తరం మాటల్లో చెప్పాలంటే మంచి ఫుడీ. కాకపోతే పిజ్జాలు, బర్గర్ల రకం కాదు. ఆరోగ్యకరమైన ఆహారం మాత్రమే స్వామి స్వీకరిస్తాడు. పోషక విలువలు మెండుగా ఉన్న ఆహారమే స్వామి నైవేద్యం. మనలాగే స్వామి కూడా రోజుకు మూడు పూటలు విభిన్నమైన ఆహారపదార్థాలు తీసుకుంటాడు. ఎప్పుడు పడితే అప్పుడు, ఏదిపడితే అది స్వామి స్వీకరించడు. ప్రాతఃకాలంలో, మధ్యాహ్న, రాత్రి సమయాల్లో స్వామికి నైవేద్యం సమర్పిస్తారు. ఆ నైవేద్యాల విశేషాలు.. ఈ ఆదివారం ప్రత్యేకం!

భోజన ప్రియుడు



ప్రత్యేక కథనం
ఆంధ్రజ్యోతి, తిరుమల

తిరుమల ప్రసాదం అనగానే లడ్డూ మాత్రమే గుర్తుకు వస్తుంది. నిజానికి 50 రకాల ప్రసాదాలను వెంకన్న స్వామికి నివేదిస్తారు. రోజూ సమర్పించేవి కొన్ని అయితే, వారానికో రోజు పెట్టేవి కొన్ని ఉంటాయి. ప్రత్యేక ఉత్సవాల రోజుల్లో సమర్పించే నైవేద్యాలు మరికొన్ని. మూలమూర్తికి సమర్పించేవి కొన్ని అయితే, మలయప్పస్వామికి నివేదించేవి మరికొన్ని ఉంటాయి. ప్రసాదాలను శ్రీవారి ఆలయంలోని పోటులోనే తయారు చేస్తారు. పోటులో ఈ వంటకాలను శ్రీనివాసుడి మాతృమూర్తి వకుళాదేవి పర్యవేక్షిస్తారని నమ్ముతారు. వీటిల్లో చాలా పరిమితమైన నైవేద్యాలు మాత్రమే భక్తులకు అందుతాయి. విక్రయించరు కాబట్టి వీటి గురించి చాలా మందికి తెలియదు.

సుప్రభాత సమయం: నవనీతం, గోక్షీరంతో తయారు చేసిన పదార్థాలను స్వామికి నివేదిస్తారు.

తోమాలసేవ తరువాత కొలువు ప్రసాదం: నల్ల నువ్వులు, బెల్లంతో చేసిన ఈ ప్రసాదాన్ని 'కొలువు పిండి ప్రసాదం' అంటారు. 'నువ్వుల చిమ్మిరి' అన్నమాట.

మొదటి గంట

ఉదయం 5.30 గంటలకు మీగడ, వెన్న, పెరుగుతో చేసే 'మాతృ దద్యోధనం' స్వామికి సమర్పిస్తారు.మాత్రన్నం (వెన్న, ఇంగువ, ఉప్పుతో చేసిన ప్రసాదం), శుద్ధన్నం, చక్కెర పొంగలి, ఉప్పుపొంగలి, పులిహోర, కదంబం, దద్యోధనం కూడా స్వామికి నివేదిస్తారు.

రెండవ గంట

పొద్దు బాగా పైకొచ్చిన తర్వాత 10 గంటలకు నాదూకం, లడ్డూ, దోశ, వడ, అప్పం నివేదిస్తారు. సేకరాబాత్ పెడతారు.

అష్టోత్తరశత నామార్చన: ఉదయం 9.45 గంటలకు శుద్ధన్నం, సీరా నివేదిస్తారు.

రాత్రి గంట

7.30 తర్వాత మరీచాన్నం(మలహోర), ఉడాన్నం (బెల్లం పొంగలి), కదంబం, శుద్ధన్నం, దద్యోధనం, పులిహోర, అమ్మవారి పాయసం(పలచగా వుండే చక్కెర పొంగలి), తోమాల దోసె, సీరాలను నివేదిస్తారు

రాత్రి విశ్రాంతి సమయంలో: పాయసాన్నం నివేదిస్తారు. పడుకోబోయే ముందు.. డ్రై ఫ్రూట్స్, పాలు, పండ్లు నివేదిస్తారు.



రోజూ పెట్టే ప్రసాదాలు చిత్రాన్నం, దద్యోధనం, క్షీరాన్నం, కదంబం, పాయసాన్నం.

వార నివేదనలు • **ఆదివారం నాడు** బియ్యపు పిండి, బెల్లం, నెయ్యితో ప్రత్యేకంగా తయారు చేసే అమృత కలశం ప్రసాదంగా పెడతారు. పానకం సమర్పిస్తారు. • **మంగళవారం** అష్టదళం తర్వాత సీరా, వడపప్పు, పానకం సమర్పిస్తారు. • **గురువారం** తిరుప్పావడలో పులిహోర, పిట్టు, జిలేబి, మురుకులను నైవేద్యంగా పెడతారు. రెండు గంగాళాల పాయసాన్ని కూడా నివేదిస్తారు. పానకం సమర్పిస్తారు. • **శుక్రవారం** అభిషేకం తర్వాత బెల్లం పాయసం, పోలీలు, పానకం నివేదిస్తారు.

మాత్రాన్నం రోజూ మొదటిగంటకు రెండు గంగాళాల మాత్రాన్నం నైవేద్యంగా సమర్పిస్తారు.

మలహోర: రోజూ రాత్రి గంటకు రెండు గంగాళాల మలహోరను నివేదిస్తారు.





తోమాలదోశ: రాత్రి నైవేద్యంగా ప్రతి రోజు 51 దోశలను సమర్పిస్తారు.



మేవా: ఏటా మూడురోజుల పాటు జరిగే వసంతోత్సవాల సందర్భంగా వివిధ రకాల పండ్ల రసాలతో ఈ ప్రసాదాన్ని తయారు చేసి సమర్పిస్తారు.

గరుడసేవ ప్రత్యేకం మనోహరం: గరుడసేవ రోజు పెద్ద మనోహరం, రథోత్సవం రోజున చిన్న మనోహరం ప్రసాదంగా స్వామికి పెడతారు.

వరలక్ష్మీవ్రతం రోజున: శనగపిండితో చేసిన సుగీలను తయారు చేసి స్వామికి నివేదిస్తారు. పెసరపప్పుతో చేసిన సుగీలను జీయంగార్ల మఠానికి పంపుతారు.

గుగ్గిళ్లు: రోహిణి నక్షత్రం రోజున, ఏకాదశి, వైకుంఠ ఏకాదశి పర్వదినాల్లో పప్పు శనగ గుగ్గిళ్ల స్వామికి నైవేద్యంగా పెడతారు. ధనుర్మాసంలోనూ రోజూ మొదటి గంటలో గుగ్గిళ్ల నివేదిస్తారు.





సేకరాబాత్ : ప్రసాదాన్ని రెండవ గంటలో ఓ గంగాళాన్ని నివేదిస్తారు.



పోలీ: శుక్రవారం ఉదయం తొలి గంటకు 102 పోలీలను సమర్పిస్తారు.



బెల్లం పొంగలి: గురువారం మినహా రోజూ నాలుగు గంగాళాలు సమర్పిస్తారు.

పులిహోర: రోజూ నాలుగు గంగాళాలు. గురువారం మాత్రం తిరుప్పావడ సందర్భంగా అదనంగా 450 కేజీలు తయారు చేసి సమర్పిస్తారు.



దధ్యోదనం: రోజూ ఎనిమిది గంగాళాలు చేస్తారు. గురువారం మాత్రం మూడు గంగాళాలు నివేదిస్తారు.



కదంబం: శని, ఆదివారాల్లో 16, మిగిలిన రోజుల్లో ఎనిమిది గంగాళాలు సమర్పిస్తారు.



మిరియాల పొంగలి: ప్రతిరోజు నాలుగు గంగాళాలు సమర్పిస్తారు.





జిలేబి: గురువారం రోజున జరిగే తిరుప్పావడ సేవ సందర్భంగా జిలేబీ, మురుకులను తయారు చేస్తారు. ఏడు పడులు అంటే దాదాపు 350 జిలేబీలను తయారుచేసి స్వామికి నివేదిస్తారు.

అమృతకలశం: ఆదివారం మాత్రమే ఈ ప్రసాదాన్ని ప్రత్యేకంగా ఒక గంగాళానికి తయారుచేసి సమర్పిస్తారు.




గర్భాలయంలోకి వెళ్లే ప్రసాదాలు: లడ్డూ, వడ, సుద్దాన్నం, మాతృ ప్రసాదం.
రోజూ క్యూలైన్లలో దర్శనానికి వచ్చే భక్తులకు పులిహోర 60 గంగాళాలు, పొంగలి 60 గంగాళాలు అదనంగా తయారు చేసి వితరణ చేస్తారు.

స్వామికి సద్దెన్నం: మాతృప్రసాదం అంటే మనం తినే సద్దెన్నం వంటిదే. స్వామివారు భూలోకానికి వచ్చినపుడు వకుళమాత ఈ ప్రసాదం పెట్టేదట. రాత్రి మిగిలిన అన్నంలో పాలు, చేమిరి వేసి పెట్టి.. ఉదయాన్నే కుమారుడికి పెట్టేదంట. అందుకే దీనికి మాతృప్రసాదం అని పేరు వచ్చిందంటారు.







హత్యకేసులో నిందితుల అరెస్టు

చిల్లకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివేడు అరుంధతివాడ వెంకటేష్ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రమణకుమార్ తెలిపారు. శనివారం చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. కడివేడు అరుంధతివాడకు చెందిన వెంకటేష్, పొట్టేళ్ల సుబ్రహ్మణ్యం మధ్య పాత గొడవ ఉన్నాయి. ఇటీవల స్వల్ప వివాదం రాగా సుబ్రహ్మణ్యంతో పాటు అతని స్నేహితులైన సాయికుమార్, సునీల్‌ను వెంకటేష్ బెదిరించాడు. దీంతో వెంకటేష్‌ను చంపాలని వారు పథకం పన్నారు. అక్టోబర్ 31వ తేదీన వెంకటేష్ మరో ఇద్దరితో కలిసి గ్రామానికి చెందిన భాస్కర్ ఇంట్లో మద్యం తాగుతున్నాడు. ఈ క్రమంలో సునీల్ వెంకటేష్ కళ్లలో కారం పొడి చల్లగా సుబ్రహ్మణ్యం, సాయికుమార్ ఐరన్ రాడ్డు, సుత్తితో దాడి చేశారు. వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేష్ తండ్రి గోపాలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కోట క్రాస్ రోడ్డు సమీపంలో సుబ్రహ్మణ్యం, సాయికుమార్, సునీల్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది రాజు, విష్ణు, భాస్కర్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమణకుమార్



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. 32వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,792మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,058మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,612మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,141, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 304మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 240మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 55మంది భక్తులు పూజలు చేయించారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,682 అమ్ముడైనట్లు తెలిపారు.



మాట్లాడుతున్న సీఐ హుస్సేన్‌బాషా

తండ్రి హత్య కేసులో తనయుడి అరెస్టు

వాకాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగరాజపట్నం పంచాయతీ శ్రీనివాసపురం గిరిజన కాలనీలో తండ్రిని చంపిన కేసులో నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. గతనెల 31వ తేదీన తుపాకుల రమేష్ తన తండ్రి చిన్నరామయ్యను హత్యచేసిన విషయం విదితమే. మద్యం మత్తులో తలపై కర్రతో కొట్టడంతో చిన్నరామయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పరారైన రమేష్‌ను శనివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ హుస్సేన్‌బాషా తెలిపారు. సమావేశంలో ఎస్ఐ నాగబాబు పాల్గొన్నారు.

సముద్ర ముఖద్వారాల పరిశీలన

వాకాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిరాయదొరువు, కొండూరుపాళెం సముద్ర ముఖద్వారాలను శనివారం మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు ప్రత్యేక అధికారులతో కలసి పరిశీలించారు. శంకర్ మాట్లాడుతూ రూ.97కోట్లతో పూడిరాయదొరువు వద్ద పులికాట్ సరస్సులోని ముఖద్వారాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. తూపిలిపాళెం, కొండూరుపాళెం వద్ద ఉన్న ముఖద్వారాలను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. తీర ప్రాంతాల్లోని గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, మత్స్యకారుల జీవన ప్రమాణాల మెరుగునకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవోలు రఘుబాబు, రెడ్యానాయక్, డీఎఫ్ఏ తదితరులు పాల్గొన్నారు.



పూడిరాయిదొరువు వద్ద సముద్ర ముఖద్వారాలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్

5న పెద్దశేష వాహనం

తిరుమల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5వ తేదీన నాగులచవితి సందర్భంగా తిరుమలలో పెద్దశేష వాహనంపై మలయప్పస్వామి దర్శనమివ్వనున్నారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ఉభయ దేవేరులతో కలిసి నాలుగు మాడవీధుల్లో ఊరేగనున్నారు. సర్పరాజైన ఆదిశేషువు జగన్నాథునికి నివాస భూమిగా, తల్పంగా, సింహాసనంగా సేవలందించినట్లు పురాణాలు చెబుతున్నాయి.

ఆటోడ్రైవర్ దారుణ హత్య

• **స్నేహితుడే కాలయముడైన వైనం**

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్నేహితుడే కాలయముడై ఆటోడ్రైవర్ నాగరాజు(28)ను దారుణంగా హతమార్చాడు. ఈ ఘటన తొట్టంబేడు మండలంలోని శివనాథపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. శ్రీకాళహస్తి పట్టణం బీపీ అగ్రహారానికి చెందిన నాగరాజు ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శ్రీకాళహస్తి పట్టణం బహదూరుపేటకు చెందిన పద్మావతి గంగను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరు శివనాథపురం పంచాయతీ పరిధిలో అద్దె ఇంట్లో కాపురం పెట్టారు. తిరుపతికి చెందిన రాజేష్ అదే ప్రాంతంలో నివాసం ఉంటూ ఆటో నడుపుకునేవాడు. ఇద్దరు కలిసి మద్యం తాగుతూ తరచూ సెంట్రింగ్ పనులకు కూడా వెళ్లేవారు. రాజేష్ నాగరాజు కుటుంబంతో సన్నిహితంగా ఉండేవాడు. ఈ కారణంగా కొన్ని రోజులుగా నాగరాజు దంపతుల మధ్య విబేధాలు తలెత్తాయి. శుక్రవారం రాత్రి ఇద్దరు గొడవపడ్డారు. సర్ది చెప్పేందుకు రాజేష్ అక్కడికి వెళ్లాడు. ఇంతలో నాగరాజు రాజేష్ పట్ల దురుసుగా ప్రవర్తించాడు. ఆగ్రహానికి గురైన రాజేష్ బండరాయితో నాగరాజు తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పద్మావతి గంగ తొట్టంబేడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పరారీలో ఉన్న రాజేష్ కోసం గాలింపు చేపట్టారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు సాగిస్తున్నారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నాగరాజు మృతదేహం

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.38 కోట్లు

తిరుమల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.38 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 67,785 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 27,723 మంది తలనీలాలు సమర్పించారు.

కార్తీకమాస మహోత్సవాలు ప్రారంభం

తిరుపతి అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన గణపతి హోమంతో కార్తీకమాస మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో నెల రోజులు ప్రత్యేక హోమాది క్రతువులు నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం విశేషంగా స్నపన తిరుమంజనం నిర్వహించి, అలంకరణ చేపట్టారు.